క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ అధికారులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రెవెన్యూ ఉద్యోగుల సంఘ నాయకులు

భీమవరం: జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయనను కలిసి ప్రజా పాలనలో అన్ని విధాలుగా సహకారిస్తామని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ గుమ్మల్ల జకరయ్య, భీమవరం డివిజన్ అధ్యక్షుడు కేడీఎస్ కెనడీ, ఉపాధ్యక్షుడు తాళ్ల దానయ్య, కార్యదర్శి పంపన సురేష్, నిమ్మల రామాంజనేయులు, రంప రత్నంరాజు తదితరులు ఉన్నారు.

కస్తూరిబా గాంధీకి నివాళి



రత్నమాల, దుర్గాదేవిలను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: కస్తూరిబా గాంధీ వర్ధంతిని భీమవరం పట్టణంలోని కస్తూరిబా గాంధీ భవనంలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గత 15 ఏళ్ళుగా మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్న రత్నమాల, దుర్గాదేవిలను సత్కరించారు. ఈ సందర్భంగా పెదనింద్రకొలను గాంధీ భవనం అభివృద్ధికి ఎన్ఎల్ఎన్ బాపిరాజు రూ.2.5 లక్షలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కార్యదర్శి ఎం.కృష్ణంరాజు, ఇందుకూరి ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయ సహాయం అందించాలి



మాట్లాడుతున్న గాదిరాజు బాబు

భీమవరం: న్యాయ విద్యను పూర్తిచేసిన విద్యార్థులు సమాజంలో పేదలకు న్యాయ సహాయం అందించాలని భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) అన్నారు. డీఎన్నార్ లా కళాశాల 34వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయ విద్యార్థుల కోసం వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎల్ఎల్ఎం కోర్సులను ప్రారంభించడానికి చర్యలు తీసుకున్నట్లు బాబు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ కె.రామకృష్ణంరాజు, సహాయ కార్యదర్శి కొత్తపల్లి శివరామరాజు, కళాశాల కో ఆర్డినేటర్ ఎం.కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ కె.రఘురామ్, జి.గోపాలకృష్ణంరాజు, చెల్లబోయిన రంగా రావు, వీర్రాజు, చిత్రభాను తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విజిలెన్స్ దాడులు



స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం జువ్వలపాలెం రోడ్డులోని ఓ పచ్చళ్ల దుకాణంపై విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా, 6 సబ్సిడీ (గృహ అవసరాల) గ్యాస్ సిలిండర్లను గుర్తించామని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ తెలిపారు. వీటి విలువ రూ.16,002 ఉంటుందని చెప్పారు. దుకాణ యజమానిపై నిత్యవసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు. భీమవరం సీఎస్ఆర్ఐ సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం: భీమవరం వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గునుపూడి, గాంధీనగర్ ఫీడర్లలో చెట్ల కొమ్మలు తొలగించడానికి పట్టణంలోని వైఎస్సార్ కాలనీ, బ్రిడ్జిపేట, గరువుపేట, ఎంప్లాయీస్ కాలనీ, సోమగుండం ఏరియా, అంబేద్కర్ నగర్, నల్లంవారి తోట, నాచువారి సెంటర్, బేతనిపేట, అయ్యంగారి వీధి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

సేవా సైనికులు వలంటీర్లు

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: క్షేత్ర స్థాయిలో సేవా సైనికులు మన వలంటీర్లు అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అభినందించారు. మండలంలోని చిన కాపవరం గ్రామంలో పెద కాపవరం, చిన కాపవరం, అప్పారావుపేట, గుమ్ములూరు, కోళ్లపర్రు, తరటావ, రాజులపేట, చిన మిల్లిపాడు, సిద్ధాపురం గ్రామాలకు చెందిన వలంటీర్లను గురువారం సత్కరించారు. ఈసందర్భంగా జరిగిన సభలో నర్సింహరాజు మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ సేవా వ్యవస్థగా వలంటీర్ల వ్యవస్థ గుర్తింపు పొందిందన్నారు. గ్రామంలోని ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్ నిత్యం సేవలందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పథకాలన్నీ మీ నుంచే ప్రజలకు చేరువవుతున్నాయని చెప్పారు. అవ్వా, తాత ఎవరినడిగినా పింఛన్ సొమ్ము వలంటీర్ ఇస్తుందని చెబుతున్నారంటే మీ సేవలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థమవుతోందన్నారు. అవినీతికి, అక్రమాలకు తావు లేకుండా పథకాలు ప్రజలకు నేరుగా అందేలా సీఎం జగన్ వలంటీర్ వ్యవస్థను రూపొందించారని చెప్పారు. మీ భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని, వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలంటే మళ్లీ సీఎం జగనే రావాలన్నారు. అందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రల్ని తిప్పికొట్టాలన్నారు. వలంటీర్లు దండగ, దగాకోరులంటూ ప్రతిపక్షాలు చేసిన విమర్శల్ని గుర్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత నాలుగేళ్లుగా వలంటీర్ల సేవల్ని గుర్తించి ప్రభుత్వం వందనం అంటూ సత్కారాలు చేస్తోందన్నారు. నగదు బహుమతులు అందజేస్తోందని పీవీఎల్ గుర్తు చేశారు. భవిష్యత్‌లో మీ సేవల్ని గుర్తించి ముఖ్యమంత్రి జగన్ మిమ్మల్ని ప్రజాప్రతినిధులుగా, ఎమ్మెల్యే, ఎంపీ స్థాయికి తీసుకువెళ్లినా ఆశ్చర్యపడనవసరం లేదన్నారు. మళ్ళీ, మళ్ళీ జగనే సీఎం అయ్యేలా ప్రతి వలంటీర్ ప్రభుత్వ పథకాలు పొందిన వారికి గుర్తు చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పళ్లెం అరుణ కుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు అన్యెం కృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ పుప్పాల పండు, సర్పంచ్‌లు నాతిరెడ్డి ఆదిలక్ష్మి, ఊసల బేబీ స్నేతు, ఎస్.చిట్టిబాబు, ఎస్.రామరాజు, ఉప సర్పంచ్ ఇందుకూరి నారాయణరాజు, మాజీ సర్పంచ్‌లు గురువెల్లి రఘుప్రసాద్, గురుదాసు బాలాజీ, పార్టీ నాయకులు ఎం.బాలు, నందమూరి సత్యవతి, నాతిరెడ్డి అన్నవరం, కత్తుల శ్రీనివాస్, కఠారి రామకృష్ణ(రాము), కేశవరావు, అల్లూరి తమ్మిరాజు, కేశిరెడ్డి దిలీప్, మల్లారెడ్డి బుజ్జి, చంటి, దింటకుర్తి వెంకటేశ్వరరావు, షరీక్, కురెళ్ల పొలు, కేశిరెడ్డి వాసు, వానపల్లి సాయిబాబు, పోలిశెట్టి కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.



ఆకివీడు: మండలంలోని చిన కాపవరం గ్రామంలో వలంటీర్లను సత్కరించిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

వలంటీర్లే సంక్షేమ వారధులు

ఉండి: రాష్ట్ర సంక్షేమానికి వలంటీర్లే వారధులు అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం మండలంలోని మహదేవపట్నంలో వలంటీర్‌లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. చిలుకూరు, ఎన్నార్పీ అగ్రహారం, మహదేవపట్నం, వాండ్రం, పెదపుల్లేరు, కలిసిపూడి, అర్తమూరు, చెరుకువాడ గ్రామాల పరిధిలోని వలంటీర్లను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా సేవా వజ్ర పురస్కారాన్ని మహదేవపట్నానికి చెందిన ఇల్లాపు మంగభవాని, సేవారత్న పురస్కారాన్ని గండేటి లక్ష్మీప్రసన్న(వాండ్రం), వి.సాయి పవన్(ఎన్నార్పీ అగ్రహారం)కు అందజేశారు. అలాగే వివిధ గ్రామాలకు చెందిన 151 మంది వలంటీర్‌లకు సేవామిత్ర పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం ఉప సర్పంచ్ ముదుండి సుబ్బరాజు ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో కేక్ కట్‌చేసి వలంటీర్లకు తినిపించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ మహోన్నతమైన సంక్షేమ పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల చేతుల మీదుగా కొనసాగించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సంక్షేమ పాలనకు సారథులుగా పనిచేస్తున్న వీరంతా చాలా గొప్పవారన్నారు. అధికారంలోకి వస్తే ప్రజలకు మంచి చేస్తానని చెప్పడం మానేసి వలంటీర్‌లను తీసేస్తాను, వైఎస్సార్ సీపీ నాయకుల అంతు చూస్తానని చెప్పడం చంద్రబాబు అహంకారానికి నిదర్శనమని అన్నారు. ప్రజలిచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసి దోచుకున్నది చంద్రబాబు కొడుకు పప్పు, దత్తపుత్రుడు అని మండిపడ్డారు. ఏం చేసినా, ఎంత చేసినా ప్రజల కోసం మాత్రమే చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతిపక్షాలు అధికారం కోసం ఎన్ని అబద్ధపు వాగ్దానాలైనా చేసేస్తారని, తరువాత వాటిని అమలు చేయరని, దీనిని ప్రజలంతా గుర్తించాలన్నారు. ప్రజలకు నిజంగా మంచి చేశాడు కనుకనే మంచి జరిగితేనే నాకు ఓటు వేయండి అని చెప్పేంత దమ్మున్న నాయుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని పీవీఎల్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, బాలం తులసి, గలావిల్లి ధనుంజయ, సర్పంచ్‌లు కొండవేటి సాంబశివరావు, సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, కరణం పార్వతి, నాయకులు ముదునూరి కొండరాజు, కోళ్ళపల్లి సతీష్‌రాజు, పేరిచెర్ల సూర్యనారాయణరాజు, ఎంపీటీసీలు మున్నలూరి సువర్ణ లక్ష్మీశ్రీనివాస్, రాయి రావులమ్మ, ఈది ఎడ్వర్డ్, దంగేటి రామలింగేశ్వరరావు, రాయి సతీష్, గుండాబత్తుల సుబ్బారావు, మాజీ సర్పంచ్ వేగేశ్న రాంబాబురాజు, బొక్కా శ్రీనివాస్, సుంకర సింగినాయుడు, సేనాపతి బాపూజీ, సుంకర శివ, రాయి శ్రీను, యడ్ల సత్యనారాయణ, ఎంపీడీవో ఎస్.రవీంద్ర, పంచాయతీ కార్యదర్శులు కె.పవన్‌కుమార్, జేవీటీ నాయుడు పాల్గొన్నారు.



ఉండి: మండలంలోని మహదేవపట్నంలో వలంటీర్‌కు కేక్ తినిపిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం 36వ వార్డులో అవార్డులు అందుకున్న వలంటీర్లను సత్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

వలంటీర్‌ల సేవలు అభినందనీయం

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు తోట భోగయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాజు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు అన్నారు. గురువారం స్థానిక 36వ వార్డులో ఇటీవల అవార్డులు అందుకున్న వలంటీర్లను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. తోట భోగయ్య ఏఎస్ రాజు మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. వలంటీర్లు ఎంతో సేవా గుణంతో ప్రజలకు అద్భుతమైన సేవలు అందిస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వలంటీర్ వ్యవస్థ మన రాష్ట్రంలో ఉందన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించడం జనం ఎప్పటికీ మర్చిపోలేరని అన్నారు. అలాంటి వలంటీర్‌లను సత్కరించుకోవడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో పీవీ నరసింహారావు, తిరుమాని రాము, కోరశిక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక సేవలో పాల్గొనాలి

భీమవరం: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మంగం వేణు అన్నారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) కళాశాల యూనిట్ ఆధ్వర్యాన కొవ్వాడ గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు శిబిరంలో గ్రామ ప్రజలకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పంపిణీ, పరిసరాల పరిశుభ్రత వంటి వాటిపై అవగాహన కల్పించడమేకాక రోడ్లను శుభ్రం చేయడం, స్కూల్ విద్యార్థులకు ఆంగ్లభాషలో ఎలా మాట్లాడాలి, ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎం.ప్రవీణ్ కుమార్, కళాశాల అధ్యాపకులు బి.వెంకట నాగరాణి, సుబ్బారెడ్డి, కె.గంగరాజు, కె.పుష్పవల్లి, చంద్రశేఖర్, కృష్ణ మాధురి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వాడలో రోడ్లను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

నూతన కార్యవర్గం ఎన్నిక

పాలకోడేరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమీపంలో సాయిబాబా మందిరంవద్ద గురువారం వాకర్స్ క్లబ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి వాకర్స్ డిస్టిక్ గవర్నర్ వై.సత్యనారాయణ హాజరై క్లబ్ విధి విధానాలు, సేవా కార్యక్రమాలను వివరించి, నూతన కార్యవర్గాన్ని ప్రకటించి, ప్రమాణ స్వీకారం చేయించారు. పాలకోడేరు వాకర్స్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షునిగా గాదిరాజు కృష్ణంరాజు (బాబు) కార్యదర్శిగా ఐ.కోటేశ్వరరాజు, సహాయ కార్యదర్శిగా ప్రసాద్‌రాజు, ఉపాధ్యక్షులుగా కె.కృష్ణంరాజు, డైరెక్టర్లుగా ఆళ్ల నాగేశ్వరావు, సత్యనారాయణ, జాలీ వాకర్ ఎ.రమణతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రీజినల్ కౌన్సిలర్ కె.నరసింహమూర్తి, జిల్లా సెక్రటరీ వి.నాగేంద్ర ప్రసాద్, గుంటూరి రామరాజు, జి.లక్ష్మణరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నడకే ఆరోగ్యం, నడక ద్వారా అనేక సమస్యలకు దూరంగా ఉండవచ్చునని తెలిపారు. క్లబ్ పలు సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్లాలని సూచించారు.



గాదిరాజు బాబును సన్మానిస్తున్న వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.సత్యనారాయణ

దేశానికి మానవ వనరులే కీలక ఆస్తి

తాడేపల్లిగూడెం: దేశానికి మానవ వనరులు ఎంతో కీలకమని వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ సురేష్ నాయక్ అన్నారు. ఏపీ నిట్‌లో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సౌజన్యంతో ఆటిట్యూడ్ అండ్ బిహేవియర్ డెవలప్‌మెంటు అనే అంశంపై గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన వర్కుషాపులో ఆయన మాట్లాడారు. దేశ ప్రగతిలో పరిశోధన ఎంతో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న విప్లవాత్మక పరిణామాలను ప్రతి విద్యార్థి ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ముందుకు సాగాలన్నారు. ప్రయోగశాలలో ఒక వైజ్ఞానిక పరిశోధన కోసం శాస్త్రవేత్తలు ఏళ్ల తరబడి అంకి తభావంతో కృషి చేస్తారన్నారు. దేశానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త సుభాష్ చంద్రబోస్ తన పరిశోధనలతో ప్రపంచ వ్యాప్తంగా ఎంతో కీర్తి గడించారన్నారు. అలాంటి వారి స్ఫూర్తితో విద్యార్థులు విభిన్నంగా ఆలోచిస్తూ కొత్త పరిశోధనలను చేపట్టాలన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ జీఆర్‌కె.శాస్త్రీ, డీన్ వీరేష్‌కుమార్, ఆచార్యులు వి.సందీప్, ఫణికృష్ణ, సంతోష్, కార్తికేయశర్మ, సుదర్శనదీప తదితరులు పాల్గొన్నారు.



నిట్‌లో మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు సురేష్ నాయక్

రైతులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: రైతులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో మంచాల సత్తిపండు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ హర్యానాలో బీజేపీ ప్రభుత్వ దమన కాండకు శుభకరణ్ సింగ్ అనే యువ రైతు బలయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 25మంది గాయపడ్డారన్నారు. తాము పండించిన పంటకు మద్దతు ధర కావాలని కోరడమే నేరమైనట్లుగా కేంద్ర ప్రభుత్వం,హర్యానా ప్రభుత్వం రైతులపై దాడులకు దిగుతుందన్నారు. ఈ సంఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలని, తిరిగి పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. రైతులు చేస్తున్న పోరాటానికి ఇఫ్టూ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల సత్తిపండు, నీలం సత్తిబాబు, జి.దుర్గారావు, ఎన్.పోసిబాబు, ఎన్.దుర్గారావు, టి.సూరిబాబు, వై.దుర్గారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథపురం గ్రామంలో జరిగిన ఇఫ్టూ సమావేశ దృశ్యం

విద్యార్థులు అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి

తణుకు టౌన్: విద్యార్థులు భారత రత్న మాజీ భారత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని తమ కలలను నిజం చేసుకోవాలని మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు తెలిపారు. గురువారం తణుకు వెంకట్రాయపురం మండల పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తణుకు పట్టణానికి చెందిన ఈమని సీతాపతిరావు జ్ఞాపకార్థం వారి కుమారులు విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సైంటిస్ట్‌గా అబ్దుల్ కలాం 26సంవత్సరాలు పని చేశారన్నారు.

కాలుష్య కోరల్లో అన్నయ్యకోడు ఛానల్

కాళ్ల: తాగునీటిని అందించే పంట కాలువను ఆక్వా చెరువుల యాజమాన్యాలు కలుషితం చేస్తున్నాయని శివారు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామ పరిధిలో అన్నయ్యకోడు పంట కాలువలోకి రహదారిని ఆనుకుని ఉన్న చేపల చెరువు నీటిని నేరుగా వదిలేయడంతో శివారు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాతాళ్ళమెరక, పల్లిపాలెం, కలవపూడి, మోడి, బోస్ కాలనీ తదితర సుమారు 10 గ్రామాలకు ఈ పంట కాలువ ద్వారా తాగునీరు, సాగునీరు అందుతోంది. అయితే గురువారం ఉదయం నుంచి మోటార్ ఇంజిన్ సహాయంతో కాలువలోకి వ్యర్థ జలాలను వదులుతున్నా సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి చెరువులకు నీరు నింపుకునే సమయంలో చేపల చెరువులో నీరు వదిలేయటంతో మంచినీటి చెరువులకు నీళ్లు ఎలా పెట్టుకోవాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. పక్కనే మురుగు కాలువ ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా చేపల చెరువులో నీరు వదలటంపై శివారు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కలుషిత నీరు తాగి ప్రజలు అనారోగ్యం బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి పంట కాలువలో వదులుతున్న నీటిని నిలుపుదల చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై వీఆర్‌వో మణిని వివరణ కోరగా చేపల చెరువులో నీటిని పంట కాలువలోకి వదలకుండా నిలుపుదల చేశామని చెప్పారు.



జువ్వలపాలెం గ్రామ పరిధిలో ఆక్వా చెరువులో నీటిని ఇంజిన్‌తో పంట కాలువలోకి తోడుతున్న దృశ్యం

ప్రజారోగ్య సమస్యలపై దృష్టి పెట్టాలి



వీరవాసరం పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో భాను నాయక్

వీరవాసరం: ప్రజల ఆరోగ్య సమస్యల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో భాను నాయక్ సూచించారు. వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోనే గర్భిణులకు ఫ్రీ డెలివరీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఓపీ రూమ్, మందుల గది, డెలివరీ రూమ్, ఓపీ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

25న ఆర్టిస్టుల వర్క్‌షాప్

భీమవరం: పట్టణంలోని అంకాల ఆర్ట్ అకాడమీలో ఈనెల 25వ తేదీన ఆర్టిస్టుల వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు అకాడమీ అధ్యక్షుడు గ్రంధి వెంకట్రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్క్‌షాప్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 82 మంది చిత్రకారులు అందరి సమక్షంలో చిత్రాలను గీస్తారని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గీసిన చిత్రాలను మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రదర్శిస్తారని తెలిపారు. అదేరోజు ప్రముఖ చిత్రకారుడు, పాలకొల్లు పట్టణానికి చెందిన మార్లపూడి ఉదయ్ కుమార్‌ను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

వీరవాసరం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సక్రమ నిర్వహణకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు భీమవరం రూరల్ సీఐ సత్య కిషోర్ తెలిపారు. వీరవాసరం మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఉన్న మధ్య దూరాలతో పాటు ఆ ప్రాంత స్థితిగతులు, పరిసర ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎస్సై పి.రమేష్, పోలీస్ సిబ్బంది, బీఎల్‌వోలు ఉన్నారు.



వీరవాసరంలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న రూరల్ సీఐ సత్య కిషోర్

ఆలయ పునర్నిర్మాణానికి భూరి విరాళాలు

ఆకివీడు: స్థానిక ఆనాల చెరువు వద్ద వేంచేసియున్న పురాతన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతల దాతృత్వం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే వందలాది మంది దాతలు భూరి విరాళాలందించారు. గురువారం ఆకివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, గంగాదేవి రూ.2,50,116లు భూరి విరాళం అందజేశారు. పట్టణానికి చెందిన నడపన అప్పారావు, సుభద్రమ్మల జ్ఞాపకార్థం మనవడు నాగ సూర్య వరప్రసాద్, కృష్ణవేణి దంపతులు రూ.2,00,116లు భూరి విరాళం అందజేసినట్లు ఆలయ చైర్మన్ నేరెళ్ల రామకృష్ణ చెప్పారు. నిర్మాణం పూర్తి అయిన ఆలయానికి రంగులు వేయాల్సి ఉందని చెప్పారు. వచ్చేనెల 20వ తేదీన స్వామివార్ల పునఃప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీలను అవమానించిన వ్యక్తి చంద్రబాబు

ఇరగవరం: ఎస్సీ కులంలో ఎవరైన పుట్టలనుకుంటారా అని ఎస్సీలను అవమానించిన వ్యక్తి ప్రతిపక్ష, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడని తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్ అన్నారు. గురువారం ఇరగవరం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోగి బాబీ ఆధ్వర్యంలో తూర్పువిప్పర్రు, ఏలేటిపాడు, కె.ఇల్లిందలపర్రు గ్రామాల్లో ఎస్సీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలను అవమానించిన చరిత్ర చంద్రబాబుది అయితే అదే ఎస్సీలకు ఉన్నతమైన మంత్రి పదవులు ఇచ్చి, పారిశ్రామికవేత్తలు, ఎక్కువ కులలాకు చెందిన వాళ్లు మాత్రమే వెళ్లగలిగే రాజ్యసభలో ఎస్సీలకు ప్రాతినిధ్యం కల్పించడం ఒక్క సీఎం జగనన్నకే సాధ్యమన్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు జాలి సుబ్బారావు, ఎస్సీసెల్ కన్వీనర్ ఎస్‌వీ జాకబ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలో తూడు తొలగింపు

భీమవరం అర్బన్: భీమవరం మండలం అనాకోడేరు పంట కాలువలో పేరుకుపోయిన తూడును ప్రొక్లెయిన్‌తో తొలగిస్తున్నారు. ఈ పంట కాలువ ద్వారా భీమవరం పట్టణం మీదుగా కొమరాడ, అనాకోడేరు, తుమ్మగొప్పి గ్రామాలకు సాగు, తాగునీరు అందుతోంది. పంట కాలువను ఆనుకుని ఉన్న సుమారు 6 వేల ఎకరాల రొయ్యల చెరువులు, చేపల చెరువులు, వరి పొలాలకు సాగునీరు, రక్షిత మంచినీటి చెరువులకు తాగునీరు అందుతోంది. పంట కాలువలో గుర్రపు డెక్క, తూడు, సిల్టు పేరుకుపోవడంతో నీటి సరఫరాకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని రైతులు, గ్రామస్తులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే నిధులు మంజూరు చేయడంతో ఇరిగేషన్ అధికారులు కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క, సిల్టును తొలగిస్తున్నారు. అంతేకాక ఎగువన ఉన్న పట్టణ వాసులు ప్లాస్టిక్, థర్మాకూల్ పెట్టెలు, బొంతలు, చిరిగిన బ్యాగులు పంట కాలువలో డంప్ చేయడంతో ఇరిగేషన్ అధికారులకు వాటిని తొలగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇరిగేషన్ ఏఈ ప్రసాదరాజు మాట్లాడుతూ పంట కాలువల్లో చెత్త వేయకూడదని, ఆ నీటిని దిగువ ప్రాంతాలు వారు తాగుతారని గ్రహించాలని కోరారు. ఎవరైనా చెత్త వేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు పైపులైన్ పనులకు శంకుస్థాపన

ఉండి: మండలంలోని ఉప్పులూరులో జల్‌జీవన్ మిషన్ నిధుల ద్వారా చేపట్టబోయే పైపులైన్ విస్తరణ పనులకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు శుక్రవారం ఉదయం 8 గంటలకు శంకుస్థాపన చేస్తారని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్ కే ఆంజనేయరాజు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.